# ప్రేమదారి మళ్ళింది

– గొల్లపూడి రాజ్యలక్ష్మి –

**పొడుగ్గా** పెరిగి విశాలంగా పరుచుకుని, మెల్ల మెల్లగా కదులుతూ చల్లని గాలిని విరజిమ్ముతూ పచ్చని చెట్లు ఆ ఆశ్రమానికెంతో ప్రశాంతతా సౌందర్యాన్ని కలిగిస్తున్నాయి. సాయంసమయం కావడం వల్ల ఎండ తగ్గి చల్లబడింది. పక్షులు బారులుగా తీరి గూళ్ళ వైపు పరుగు పెడుతున్నాయి. వెలుగు తగ్గుతున్న ఆకాశం ఎరుపెక్కి చిక్కపడుతూంది.

ఆ ఆశ్రమం ఎత్తయిన ప్రదేశంలో ఉండటం వల్ల దూరాలు వెయ్యి తిరిగిన చిత్రకారుడి మనోజ్ఞ సృష్టి ఫ్రేము కట్టినట్లు హృద్యంగా అవుపిస్తున్నాయి. అట్లా దూరాల్లోకి మధ్య మధ్య దృష్టిని నిగిడిస్తూ మళ్ళీ స్పృహలోకి వచ్చినట్లు పరిసరాల్ని చూస్తూ ఆ కాలిబాట గుండా నడుస్తోంది దమయంతి. ఒంటరిగా ప్రశాంతత నిండిన ఆ ప్రదేశంలో ప్రకృతిలో తానొకరుగా తిరుగాడుతూంటే మనసుకేదో హాయిగా, శాంతిగా అనిపిస్తోంది. ఆశ్రమానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వచ్చాక, సమతలంగా ఉన్న పెద్ద బండరాయిమీద కూర్చుని అక్కడ నించి ఆశ్రమం వైపు చూసింది దమయంతి. సుమారు ఇరవై ఎకరాల స్థలంలో ఉన్నదా ఆశ్రమం. విశాలమైన ప్రార్థనా మందిరం చుట్టూ చిన్న చిన్న ఆవాసాలు, మరోపక్క భగవాన్ మహర్షి మందిరం, కాస్త దూరంలో వంటశాల, వచ్చే పోయే యాత్రికుల కోసం ప్రత్యేక భవనం—అన్నీ ఒక పద్ధతిగా తీర్చిదిద్దినట్లు సౌకర్యంగా ఉన్నాయి. దృష్టిని మరల్చుకుంటూ నిట్టూర్చింది దమయంతి.

"తన జీవితంలో ఇట్లా ఒక ఆశ్రమానికి ప్రాధాన్యం ఉంటుందని ఎప్పుడైనా వూహించిందా? మనిషి తలచినవి జరుగక పోగా వూహించని వాటిని ఎదుర్కొనటమే జీవితం కాబోలు. పిల్లలకు పాఠాలు బోధించిందే గానీ, జీవితం నేర్పే పాఠాలు గ్రహించలేకపోయింది తను.

చలిగాలికి ఎగురుతున్న పమిట కొంగును భుజం మీదికి లాక్కుంటూ పడమటి ఆకాశం వైపు చూసింది. ఆ అసుర సంధ్యలో తన జీవన సంధ్య ప్రతిబింబించినట్లనిపించిందామెకు. ముసురుతున్న చీకట్లు వృద్ధాప్యంగా, చిక్కపడి పోతున్న ఎరుపు క్రుంగదీస్తున్న దిగులుగా అనిపించింది. ప్రతి క్షణం దేనికో దానికి ఆరాటపడుతూ ఈ ప్రపంచంలో అన్నీ తన కోసమే అనీ, బతుకు శాశ్వతమనీ భ్రమసే మనిషి గమ్యం చివరి కింత భయంకరమా?.

దమయంతి దృష్టి హఠాత్తుగా తనకు కుడి వైపున కాస్త దిగువ ప్రదేశంలో కూర్చుని ఉన్న వ్యక్తిపై పడింది. రెండు చేతులపై వెనక్కివాలి ఏదో దీర్ఘాలోచనలో ఉన్న ఆ వ్యక్తిని దాదాపు పది రోజుల నించి ఈ ఆశ్రమంలో చూస్తోంది దమయంతి. తెల్లని గౌనులో, పండిన జుత్తుతో నీలికళ్ళ చుట్టూ పరుచుకున్న నల్లని వలయాలతో ఏదో అశాంతి నింపుకుని. ఆమె వయసు దాదాపు తన వయసే. విదేశీయులను సైతం అయస్కాంతంలా ఆకర్షిస్తున్న మహర్షి ఆశ్రమం గురించి తనకు తెలిసినదే అయినా, ఆ వ్యక్తిని చూస్తున్నప్పుడు తనలో ఏదో విచిత్రమైన ఆసక్తి. తన దేశం కాదు. భాష కాదు. అయినా దేని కోసం ఇంతదూరం వచ్చినట్లు? జీవిత చరమాంకంలో ఉన్న ఆమె పాపం ఇట్లా ఒంటరిగా తన వాళ్ళను విడిచి...

మనిషి తాను కష్టాలలో, అశాంతిలో మునిగి ఉన్న స్థితిలో కూడా ఎదుటి మనిషిపై ఆసక్తిని, సానుభూతిని కురిపించటం చిత్రమే మరి! తన పరిస్థితిని మరిచి ఆమె గురించిన జిజ్ఞాస దమయంతిలో తలెత్తింది. మెల్లగా లేచి ఆమె వైపు అడుగులు వేసింది.

"నే నిక్కడ కూర్చోవచ్చునా?" అనడిగింది ఆమె నుద్దేశించి ఆంగ్లంలో.

తపోభంగమైన మునిలా కళ్ళు విప్పి ఆశ్చర్యాన్ని కనబరుస్తూ కూర్చోమన్నది.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా?"

"నిజమే. కాని దాని వల్ల నష్టం ఏం లేదు లెండి!" అన్నది నవ్వి.

పరస్పర పరిచయాలు అయినాయి.

ఆమె పేరు ఎలిజబెత్. అమెరికా దేశస్థురాలు. ఆశ్రమంలో స్థిరపడటానికి వచ్చినట్లు చెప్పింది.

ఇద్దరూ ఆశ్రమ అవుష్కత్యాన్ని గురించి, భగవాన్ మహర్షి ప్రసంగాలలోని అంతరార్థాల గురించీ మాట్లాడుకున్నారు. అప్పటికే చీకటి కమ్ముకొస్తుండటం వల్ల ఇద్దరూ లేచి ఆశ్రమాభిముఖంగా దోవ తీశారు.

## 2

ఆ మరునాడు ప్రార్థనా మందిరంలో ఒకరినొకరు చూసుకుని గుర్తింపుగా చిరునవ్వు నవ్వారు. మిగతా కార్యక్రమా లప్పుడు కూడా ఇద్దరూ చేరువగానే ఉన్నారు. ఆ సాయంత్రం వాహ్యాళికి కలిసే బయల్దేరారు. నిన్నటి కంటే ఈ రోజు ఇద్దరి మధ్యా సాన్నిహిత్య మేదో ఏర్పడినట్లు అనిపించింది. అలవాటుగా కూర్చొనే చోట ఆగిపోయింది దమయంతి. కూర్చున్నా రిద్దరూ. చాలాసేపు మౌనం తర్వాత ఎలిజబెత్ అన్నది:

"మిసెస్ దమయంతీ! మిమ్మల్నో ప్రశ్న అడుగుతాను. ఏం అనుకోరు కదా?" అని

"అనుకోవటాని కేముంది? అడగండి!" అన్నది ప్రశాంతంగా చూస్తూ.

"మీ రీ దేశం వారే గదా! మీ రిక్కడిలా ఒంటరిగా ఎందుకుంటున్నారు? మీ వాళ్ళంటూ మీ కెవరూ లేరా?"

ఆ ప్రశ్నతో దమయంతి ముఖంలో ప్రశాంతత చెదిరిపోయింది.

"లేకేం? నాకు ముగ్గురు పిల్లలున్నారు" అన్నది నిట్టూరుస్తూ.

"మీ భర్త?"

"లేరు ... చాలా సంవత్సరాల క్రితమే చనిపోయారు."

"సారీ ... మిమ్మల్ని బాధపెడుతున్నానేమో?"

"లేదు లెండి."

"మీకు పిల్లలుండీ ... ఇట్లా? మీ ఇండియాలో సెంటిమెంట్స్ ఎక్కువనీ, అవి మనుషుల్ని బంధించి ఉంచుతాయనీ విన్నాను. ముఖ్యంగా తల్లి దండ్రుల పట్లా పిల్లలు పట్లా వృద్ధాప్యంలో ఉన్నప్పుడు చాలా ప్రేమతో, కృతజ్ఞతతో ఉంటారని విన్నాను."

నవ్వొచ్చింది దమయంతికి. దూరపు కొండలులా భ్రమను కొల్పే ఈ ఇండియా ప్రేమ, అను బంధాల నిజస్వరూపం తెలిశాక ఏమనుకుంటుందో చివరకు.

"మీకు ఆ విషయాల గురించి తెలియాలంటే ముందుగా నా గురించి మీకు పూర్తిగా చెప్పాల్సి ఉంటుంది" అని కొంచెంసేపు ఆగి —

"నా విషయం చెప్పే ముందు నా దో చిన్న సందేహం తీర్చాలి మీరు" అన్నది, ఆమె వంక సూటిగా చూస్తూ.

"ష్యూర్ ... అడగండి."

"నేను తిరిగి మిమ్మల్నిట్లా ప్రశ్నిస్తున్నందుకు మన్నించాలి. మీరు అమెరికన్లు కదా! మీ దేశం, భాష, వ్యవస్థ అన్నీ మాకు భిన్నమైనవే. మీకు సెంటిమెంట్లు ఉండవంటారు. బాధ్యతలు తక్కువ. ఆర్థికమైన ఇబ్బందులు లేవు. వ్యక్తి స్వాతంత్ర్యం ఉంది. నిజానికి మీకు లేనిది ఏముంది? సాధారణంగా మా దేశంలో డబ్బుతో పరిష్కారం కాని సమస్యలు చాలా తక్కువ. ఆ డబ్బులేకపోవడం వల్లనే ఇక్కడి ప్రజలు సమస్యల వలయాల్లోపడి కొట్టుకుంటున్నారు. మీకు డబ్బు కొరవేంలేదు కదా? మరి మీరు దేనికోసం ఇంతదూరం వచ్చి ఈ ఆశ్రమంలో ఉంటున్నారు?"

ఎలిజబెత్ తమాషాగా నవ్వింది.

"డబ్బుతో మనశ్శాంతిని కొనలేముగా!" అన్నది.

"అదే ... అదే నా ప్రశ్న. ఎందుకని? మీరు యాంత్రికమైన జీవితానికి మొదటి నుంచీ అలవాటు పడే ఉంటారు. మీ పిల్లల నుంచి మీరేమీ ఆశించరని, ఎవరి జీవిత విధానాన్ని వారే రూపొందించుకుని విడిపోతారని విన్నాను. ఎవరి ఆంక్షలూ, ఒత్తిడులూ లేని ఫ్రీ బర్డ్ లాంటి జీవితం ఉన్నా..., మనశ్శాంతి ఎందుకని పొందలేకపోతున్నారు?"

ఎలిజబెత్ చాలాసేపు ఏదో ఆలోచిస్తున్నట్లు మవునంగా ఉండిపోయింది.

"దమయంతీ! నాకు ఇంత దగ్గరగా వచ్చి, నా విషయాలన్నీ ఆత్మీయంగా ప్రశ్నిస్తున్న మొదటి వ్యక్తి మీరే. అందుకే నా గురించి మీకు నిస్సంకోచంగా చెప్తాను. వినండి. మా జీవిత విధానంపట్ల మీరు విన్న విషయాలలో అసత్యం లేదు.

మా తల్లిదండ్రులకు నేనూ, మా సోదరి ఇద్దరమే. మేము పుట్టినది మొదలుగా ఆయాల చేతుల్లోనూ, బేబీ సిట్టింగ్స్‌లోనూ పెరిగాము. వూహ తెలిశాక మా తల్లిదండ్రులతో పార్టీలకు గానీ, షాపింగ్‌లకుగానీ, వీకెండ్‌కు పోయే పిక్నిక్‌లకు గానీ చాలా అరదుగా వెళ్ళేవాళం. వాళ్ళకు, మాకు మధ్య ఉండేది కేవలం బాధ్యత, స్నేహం అంతే. ఆత్మీయత అన్నది మాకు దొరకటం చాలా తక్కువ మాలో ఎక్కువ మంది పిల్లలు తల్లి స్తన్యం ఎరుగరు.

అందువల్లనే మమతాను బంధా లుండవేమో...నాకు తెలీదు. మాకు కావాల్సిన అవసరాలు యుక్తవయసు వచ్చేవరకు వాళ్ళే తీరుస్తారు. ఆ తర్వాత మా జీవితం వేరవుతుంది. అట్లా వేరుగా వెళ్ళిపోతున్నందుకు మాకేం బాధగా ఉండదు. ఇష్టంలేని వాళ్ళ నుంచి విడిపో వచ్చు. మీ రన్నట్లు అది యాంత్రికమైన జీవితమో, ఆత్మ విశ్వాసమో ... ఏదైనా అనండి. కానీ ... మా అమెరికన్లంతా అట్లాగే ఉంటారనుకోవటం మీ భ్రమ. మనసుకు పూర్తిగా వచ్చిన వ్యక్తి తారసపడినప్పుడు అతనితో జీవితాంతం గడపాలనుకునే వ్యక్తులు తక్కువేం కాదు. సరే ... నా సంగతి కొస్తాను. నేను పెరిగి పెద్దదాన్నయినాక జర్నలిజం నా అభిమాన విషయం అవటం వల్ల అందులోనే డిప్లొమా పొందాను. ఒక పత్రికాఫీసులో రిపోర్టరుగా ఉద్యోగం దొరికింది. ఉద్యోగరీత్యా వివిధ ప్రదేశాల్లో తిరగాల్సి వచ్చేంది. మా ఆఫీసులో నాతో పాటు పనిచేస్తున్న విలియమ్స్‌తో అప్పుడే పరిచయం ఏర్పడింది. మా ఇద్దరికీ వృత్తి రీత్యా అయితేనేం, అభిరుచులు కలవటం వల్ల అయితేనేం స్నేహం పెరిగి ప్రేమలోకి దారితీసింది. ఇద్దరం చాలాకాలం కలిసితిరిగి ఒకర్నొకరు అర్థం చేసుకుని, ఇంక వదిలి ఉండటం కష్టం అనుకున్న తర్వాత పెళ్ళి చేసుకున్నాము. అంతకు పూర్వమే మా పేరెంట్స్ నుంచి విడిగా వచ్చి ఉంటున్నాను గనుక, ఈ వివాహంతో నా జీవితం పూర్తిగా వారినుంచి వేరై పోయింది.

అప్పట్లోనే నేను చాలా పుస్తకాలు చదివి విలియమ్స్‌తో చర్చిస్తూండే దాన్ని. ఆ ఒరవడిలో ఇండియాకు సంబంధించిన కొన్ని పుస్తకాలు చదవటం తటస్థించింది. టాగూర్ 'గీతాంజలి', 'రామాయణం' నన్ను ఆకర్షించాయి. ముఖ్యంగా 'రామాయణం' చదవగానే ఇండియా పట్ల నాకు కుతూహలం పెరిగింది. అందులో తండ్రీ కొడుకుల మధ్య, భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాలు, సెంటిమెంట్లు...ఎందుకనో బహుశా నా మనసు వాటిని కోరుకోవడం వల్లనేమో బాగా నచ్చాయి. మీ దేశ ఆచారాలూ, వ్యవహారాలూ, మీ కుటుంబ వ్యవస్థా అన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాను. వీలైతే ఒకసారి ఇండియా చూడాలన్న కోరిక అనుకోకుండా నెరవేరింది. అప్పటికి నాకు ఇద్దరు మగపిల్లలు. 'భారతీయ సాహిత్యం వాటి తీరు తెన్నుల'పై రీసెర్చి మొదలుపెట్టాను. ఆ విషయమై ఇండియా రావటం తటస్థించింది. అప్పుడు నాతో విలియమ్స్ కూడా వచ్చాడు. ఇద్దరం ఈ దేశమంతా తిరిగాము. ఆఖరికి ఆశ్రమాలూ, గుళ్ళూ కూడా వదిలిపెట్టకుండా చూశాము. అప్పుడే ఈ ఆశ్రమం చూడటం జరిగింది. అప్పటికి మహర్షి చాలా చిన్నవారు. ఆశ్రమం ఇంతగా అభివృద్ధి చెందలేదు. వూరికే చూసి పోదామని వచ్చిన నేను మహర్షిని చూశాక ఏదో ఒక అలౌకికమైన ఆనందాన్ని క్షణమాత్రం పొందగలిగాను. ఆ ఆనందం మరువలేనిదీ, మాటల్లో వర్ణించలేనిది! తిరిగి అమెరికా వెళ్ళిపోయినా, ఈ ఆశ్రమం నా స్మృతి పథంలో నిలిచిపోయింది.

నా కిద్దరు పిల్లలు కలిగాక నాకూ, విలియమ్స్‌కీ అభిప్రాయభేదా లొచ్చాయి. విలియమ్స్ అతిగా తాగేవాడు. అది నాకు ఇష్టం ఉండేది కాదు. ఆ విషయంలో విసిగిపోయి అతనికి విడాకులు ఇచ్చాను. విలియమ్స్, నేనూ విడిపోయాక, ఒంటరిగా మిగిలాక గడిచిన కాలమంతా మహావేగంగా జరిగిపోయి నా ముందు అతి భీకరంగా భవిష్యత్ వర్తమానాలు స్తంభించి పోయినట్లు అన్పించింది. జరిగే ప్రతి నిముషం ఏదో అశాంతి. అనిశ్చితం. కేవలం తిండీ, నిద్రేనా? ఇదేనా జీవితం? ఇంకా ఏదో కావాలి ఈ మనసుకు. అన్వేషణ సాగించాను. ఆ ఒంటరితనంలో థామస్ తటస్థ పడ్డాడు. అతని ఆకర్షణకు లోబడి జీవితంలోకి ఆహ్వానించాను. కొన్నాళ్ళు ప్రశాంతంగా గడిచాయి. తరవాత అతని బలహీనతలు తెలిశాయి. థామస్‌తో జీవించటంలో నాకు పరిపూర్ణత కన్పించలేదు. అతడు సోమరిపోతు. డబ్బు కోసం పీడించేవాడు. పైగా ఆడపిచ్చి. అతని కెంతమందో గరల్ ఫ్రెండ్స్ ఉన్నారు. తాగుబోతయినా విలియమే నయమనిపించేవాడు. అతడితో ఎక్కువ కాలం ఉండలేదు. థామస్ నా జీవితంలోంచి వెళ్ళాక చాలాకాలం ఒంటరిగా ఉన్నాను.

పిల్లలు పెద్ద వాళ్ళయి వారి దారి వేరైంది. ఒంటరిగా నేను. మళ్ళీ తోడు కోసం వెర్రెత్తింది మనసు. నేను పని చేస్తున్న పత్రిక యజమాని నాకన్నా చిన్నవాడయినా నన్ను ఇష్టపడ్డాడు. ఇద్దరం ఒకే వృత్తిలో ఉంటాం కనుక జీవితం ఉత్సాహంగా ఉంటుందని అనుకున్నాను. అతనికి వ్యాపారం మీద ఉన్న శ్రద్ధ సంసారం పట్ల లేదు. నాలో ఉన్న ప్రతిభని తన పత్రిక సర్క్యులేషన్ పెంచటానికి ఎన్నివిధాల ఉపయోగపడుతుందో అన్ని విధాల వాడుకున్నాడు. మే మిద్దరం ఏకాంతంగా ఉన్నప్పుడు కూడా అతని కా గొడవే. అతనికి నాలో ఉన్న ప్రతిభ తప్ప, నేను అవసరం లేదని, నాతో దాంపత్య జీవితం గడపటం పట్ల అతనికి ఆసక్తి లేదని అర్థమైంది. పని చేసి చేసి అలసిపోయిన నాకు చల్లటి స్పర్శ, వోదార్పు కావాలి. అవి అతను ఇవ్వలేడని తెలిశాక, ఇంకా ఆ ఎండమావిని ఎంతకాలం నమ్ముకునేది? అతన్ని వదల్చుకుని ఉద్యోగానికి రిజైన్ చేసి బయట పడ్డాను.

నా పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకుని స్థిరపడ్డారు. వాళ్ళ దగ్గర కెళ్ళినా నాకు కావల్సిన ఆత్మీయత దొరకదని నాకు తెలుసు. వాళ్ళ ప్రపంచం వేరు. నా ప్రపంచం వేరు. అది మాకు సర్వసాధారణమైన విషయమైనా, నే నెందుకనో నిర్లిప్తతగా బతకలేక పోతున్నా ననిపించింది. మరో పత్రికాఫీసులో ఉద్యోగమయితే దొరికింది గానీ, మనశ్శాంతి దొరకలేదు. డబ్బు బాగానే సంపాదించాను కనుక ఆర్థిక బాధలు లేవు. అయినా ఏదో అశాంతి. అందరిలా ఇదే జీవితమని ఎందుకనో సరిపుచ్చుకోలేక పోయాను. మనశ్శాంతికోసం డ్రింక్ తీసుకోవటంమొదలెట్టటంతో ఆరోగ్యం చెడింది. నెలరోజుల బెడ్ రెస్ట్‌తో కోలుకున్నా. ఆత్మీయమైన పలకరింపు కోసం మొహం వాచిపోయినట్లయింది. ఎందుకోసం ఈ బ్రతుకు

అన్న విరక్తి కలిగింది. కొత్త ప్రదేశాలు చూడటం వల్ల కొంత మనసుకు వూరట కలుగుతుందన్న ఆశతో దేశమంతా తిరిగాను. అయినా ప్రయోజనం కనిపించలేదు. అప్పుడే ఇండియాలో ఈ ఆశ్రమం,

అప్పటి అనుభూతి గుర్తుకొచ్చింది. నా దేశంతో అనుబంధాలన్నీ తెంచుకుని, శాశ్వతంగా ఇక్కడికి వచ్చేశాను." ఆగింది ఎలిజబెత్.

అంతా విని నిట్టూర్చింది దమయంతి.

'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అన్నట్లు 'ఏ మనిషి జీవితం శోధించినా ఏదో అపశ్రుతి' ఈ ప్రపంచం అంతా ఒక గొప్ప అశాంతి ప్రవాహంలో కొట్టుకుపోవటం లేదు కదా! అనిపించింది దమయంతికి.

అప్పటికే పూర్తిగా చీకట్లు వ్యాపించటంతో అక్కడితో ఆ ప్రసంగాన్ని విరమించి తిరోన్ముఖులయారు.

## 3


"మిసెస్ ఎలిజబెత్! మీ ఆత్మ కథ విన్నాక మనిషికి నిజంగా సుఖ మనేది ఎప్పుడైనా, ఎక్కడైనా దొరుకుతుందా? అన్న సందేహం నాలో తలెత్తి నిన్న రాత్రంతా ఆ ఆలోచనలతోనే గడిచిపోయింది.

అయితే సుఖానికి నిర్వచనం ఏమిటి? అన్న ప్రశ్నకు కూడా సరైన సమాధానం అంత సులభంగా దొరకటం లేదు. నాకు నిద్రించటంలో ఉన్న సుఖం మీకు సేవ చేయడంలో దొరక వచ్చు. సుఖమనేది బహుముఖా అన్న మాట! అట్లాగే కష్టం కూడా ... ఈ కష్టసుఖాలు కలగలిపిన జీవితం ఏ సందేశం కోసం సృజించబడిందో... ఆలోచిస్తే చాలా చిత్రంగా ఉంటుంది. ఇంక నా గురించి వివరిస్తాను వినండి.

నేనొక మధ్య తరగతి కుటుంబంలో పుట్టాను. మా వాళ్ళు సంప్రదాయ పద్ధతిలో నా పదిహేనవ ఏటనే నాకు పెళ్ళిచేసి బరువు దించుకున్నారు. దాదాపుగా పది సంవత్సరాలు నా భర్తతో కాపురం చేసి ముగ్గురు పిల్లల్ని కన్నాక, నా భర్త హఠాత్తుగా ఆక్సిడెంటులో పోయాడు.

పాతికేళ్ళ వయసుతో, ముగ్గురుపిల్లలతో మిగిలిన అప్పటి నా జీవితం అంధకార బంధురం. నా భర్త తాలూకు డబ్బు కొంత వచ్చింది. దాంతో ఎట్లా బ్రతకాలి? నా తండ్రి కూడా బహు కుటుంబీకుడు! చాలీచాలని జీతగాడు. నేనూ, నా పిల్లలూ ఆయనకు తలకు మించిన బరువే. అక్షర జ్ఞానం తప్ప అంతగా చదువుకోని నేను తిరిగి పుస్తకం పట్టాను. చదువుకొని ఏదో ఒక జీవనాధారాన్ని చూసుకోకపోతే నా బిడ్డలు ముష్టివాళ్ళుగా మారటానికి ఎంతోకాలం పట్టదనిపించింది. అట్లా చదివి మెట్రిక్యులేషన్ పాసయి టీచర్ ట్రెయినింగ్ అయాను. అప్పట్లో మా దేశంలో నిరుద్యోగ సమస్య ఇంతగా పీడించటం లేదు కనుక వెంటనే ఉద్యోగం దొరికింది. పిల్లలే నాకు మిగిలారు కనుక వాళ్ళే నా సర్వస్వ మనుకున్నాను. వాళ్ళ ఉన్నతికోసం నా శక్తివంచన లేకుండా కృషి చేయాలని నిశ్చయించుకున్నాను. నా కిద్దరు కొడుకులు, ఒక






ఆడపిల్ల. వాళ్ళు ఎదుగుతున్నకొద్దీ ఖర్చులూ పెరుగుతున్నాయి. అట్లాగే పట్టుదలతో బి. ఎ. చేసి బి. ఇ.డి, అయ్యాను. నా పిల్లలు ముగ్గురికీ నేనంటే ప్రాణం. నాకు వాళ్ళే ఊపిరి. రాత్రిళ్ళు వాళ్ళ మధ్య పడుకుని కబుర్లు, కథలు చెప్తూ నిద్రపోతుంటే నా జీవితాని కంతకన్నా సాఫల్యం లేదనిపించేది.

ఒంటరిగా వయసులో ఉన్న స్త్రీకి మా సమాజంలో చాలా చిక్కులు ఎదురవుతాయి. అవి హెడ్మాస్టర్ల రూపంలో నైతేనేం, తోటి టీచర్ల వల్ల నైతేనేం, డి. ఇ. వో.ల రూపంలో నైతేనేం ... అగ్ని పరీక్షలు తప్పవు. నేను ఏమాత్రం సందు ఇచ్చినా బురదలోకి ఈడ్చి నా పతనానికి సంతోషించే తత్త్వం గల వాళ్ళు ఎంతోమంది ఎదురైనారు. అప్పటికి నేను వయసులో ఉన్నా, నా రక్తంలో జీర్ణించుకుపోయి ఉన్న సంప్రదాయాలు అయితేనేం, నా కాళ్ళకు చుట్టుకుని ఉన్న రెక్కలు రాని పిల్లలయితేనేం నాలో బలహీనమైన ఆలోచనల్ని కలిగించలేదు. ఈ జీవితానికి సార్ధకత నా పిల్లలే అనుకుని తృప్తి పడ్డాను. నే నొక కొరకరాని కొయ్యనని తెలుసుకుని మారుమూల వూళ్ళకు ట్రాన్స్ఫర్ చేయించి నానా తిప్పలూ పెట్టారు. అన్నిటినీ సహించి నేను ఎన్నుకున్న పథంలో పయనించాను. అప్పట్లో నేను పడిన బాధలు ఇప్పుడు తల్చుకుంటే అవన్నీ నేనేనా భరించింది అనిపిస్తుంది. మగ దక్షత లేని కుటుంబం, ఉద్యోగం, ఇల్లు, బాధ్యతలు, పిల్లల చదువులు, రోగాలు, చికాకులు, ఎన్నో ముళ్ళపొదలు! కాలం ఎట్లా గడిచిందో వీటి మధ్య గమనించే తీరిక కూడా లేదు.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. మా పెద్దబ్బాయికి అంతగా చదువు అంటలేదు. ఎట్లాగో బి. ఎ.,బి.ఇడి., అయిందనిపించి టీచరుగా స్థిరపడ్డాడు. రెండోవాడు చాకులాంటివా డవటం వల్ల ప్రతి క్లాసులో డిస్టింక్షన్ తెచ్చుకుని, స్కాలర్షిప్పులతో వాడి కిష్టమైన మెడిసిన్ చదివాడు. అమ్మాయి కూడా డిగ్రీ పూర్తి చేసి బాంకులో క్లర్కుగా పనిచేస్తోంది. వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ అయినాక నేనూ, నా ఉద్యోగం మిగిలాము. పిల్లలు నా దగ్గర లేదన్న వెలితి ఉన్నా, ఉద్యోగ నిర్వహణలో దాన్ని మర్చిపోగలిగాను. వాళ్ళూ సంసారాలు పెరిగి పూర్తిగా సెటిలయి పోయారు. అప్పుడప్పుడూ ఉత్తరాలూ, పండుగలకు కలుసుకోవటం జరుగుతున్నా నా లోని ఒక భాగం విడిపోయినట్లు కొరతగా ఉండేది. మొదటినుండీ వాళ్ళతో అటాచ్మెంట్ అధికం కావటం ఈ లోటుగా అన్పించటం సహజం.

ఉద్యోగ విరమణ చేశాక నే నెక్కడ ఉండాలన్నది ప్రశ్నగా మిగిలింది. మా పెద్దబ్బాయి దగ్గర ఉండటం సబబుగా అన్పించి, నా ప్రావిడెంట్ ఫండ్ తాలూకు డబ్బుతో వాడి దగ్గర చేరాను. వాడి కిద్దరు పిల్లలు. జీతం తక్కువ. ఎప్పుడైనా మరీ అవసరం అనుకున్నప్పుడు ఇంటి ఖర్చుకోసం నా దగ్గరున్న డబ్బును ఖర్చు పెట్టేదాన్ని. నా ఇద్దరి మనవాలతో అక్కడ నాకు కాస్త కాలక్షేపం అవుతుం దనుకున్నాను. ఉదయం లేచాక స్నానం, పూజ తర్వాత కోడలికి వంటలో సాయపడేదాన్ని. భోజనానంతరం పేపరు చూడటం, పుస్తక పఠనంతో ప్రొద్దుపుచ్చేదాన్ని. సాయంత్రం అబ్బాయి స్కూలు నుంచి వచ్చాక కొంచెంసేపు కష్టసుఖాలు మాట్లాడాలని ఎంతగానో అన్పించేది. అయితే వాడుమాత్రం ఒక్క చిరునవ్వుతోనే సరిపెట్టి, లోపలి కెళ్ళి భార్యతో కబుర్లలో పడేవాడు. నాలో అసంతృప్తి అప్పుడే మొదలైందని అనుకుంటాను. ఎంతసేపని పేపరు తిరగేయను? చదివీ, చదివీ విసుగెత్తిపోయింది.

పని చేయటం, పాఠాలు చెప్పటం మొదటి నుంచీ అలవాటు పడిన దాన్నేమో...ఏ పనీ లేకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా సోమరిగా ఉండటం పిచ్చెత్తిస్తుందేమో అనిపించేది. మనమలకి చదువు చెప్పాలని ప్రయత్నించాను. కానీ నే నెంతగా ప్రేమాదరాలు చూపి, దగ్గిరికి చేరదీయాలని ప్రయత్నించినా వాళ్ళు నా నుంచి తొలగి పోయే వారు. దానికి కారణం తరవాత అర్థమైంది. నా కోడలుకి నాపై ఏదో అసంతృప్తి—నా దగ్గర ఉన్న కాస్త మొత్తం పూర్తిగా వాళ్ళకి ఇవ్వకుండా నా దగ్గరే ఉంచుకున్నానని. అందుకే నే నెంత కల్పించుకుని మాట్లాడినా, కోడలు నాతో స్వేచ్ఛగా మాట్లాడేది కాదు.

వీళ్ళ సంగతి అట్లా ఉంచితే మా అబ్బాయి ప్రవర్తనే నాకు అర్థమయేది కాదు. చిన్నప్పటి నుంచీ నా దగ్గర చనువుంది. చదువు పూర్తయి ఉద్యోగంలో చేరిన తరవాతకూడా అడగకుండానే ఖర్చుల కుంచుకోమని డబ్బిచ్చి, బట్టలు కొనిపెట్టి ఆర్థికంగా తను చిన్నవాడి కంటే తక్కువ అనే భావం వాడిలో తలెత్తకూడదని ప్రయత్నించే దాన్ని.

29—6—83

అప్పట్లో వాడు తన కేది కావాలన్నా నిస్సంకోచంగా అడిగి నా సలహా ప్రతి విషయంలోనూ కోరేవాడు. ఆఖరికి వాడి పెళ్ళి విషయంలోకూడా నా ఇష్టానికి ప్రాధాన్యత ఇచ్చాడు. ప్రతి దానికీ అమ్మా, అమ్మా అంటూ నా చుట్టూ తిరిగే వాడికి ఇప్పుడు నే నెందుకని పరాయిదాన్ని అయిపోయానా అని మథనపడేదాన్ని. అమ్మా! అంటూ నా చుట్టూ తిరిగిన వాడు. 'సారూ!' అంటూ భార్య చుట్టూ తిరుగుతూంటే ఏదో అశాంతి! కొంచెం సేపు నా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పకూడదా! అనిపించేది. ఇవన్నీ వాడిని అడుగుదామన్నా అడిగి పొందటంలో ఆనందం ఉంటుందా?

ఆ ఇంట్లో నేనొక బంధువును. అంతే! నా దగ్గర ఉన్న డబ్బు కాస్తా వాళ్ళ కిస్తే, వాసట్ల కాస్త ప్రసన్నంగా ప్రవర్తించే వాళ్ళేమో! కానీ అట్లా చేసి ప్రతి పైసాకు చెయ్యి చాచి దేహీ అనటం నా కిష్టం లేదు. నా విషయంలో వాడికా అసంతృప్తి ఉన్నట్లు క్రమంగా నా కర్థమై నా మనసు దెబ్బ తిన్నది. అది నా ఇల్లే అనుకుని వెళ్ళాను. కానీ 'నా' అస్తిత్వానికి ఆధారం దొరక లేదక్కడ. అందుకే అది నా ఇల్లు కాదనిపించింది. నాకు కావాల్సిన ఆత్మీయతను వెతుక్కుంటూ కొంత కాలం తరవాత రెండో వాడి దగ్గరకు ప్రయాణ మైనాను.

వేణు ఎమ్. డి. చేసి వాళ్ళ మామగారి సహాయంతో ప్రాక్టీస్ పెట్టుకున్నాడు. వాడి భార్య నళినికూడా డాక్టర్. వాళ్ళ కో అబ్బాయి. ఉదయం నర్సింగ్హోమ్ కెళ్ళే వారు. సాయంత్రం దాకా రారు. అబ్బాయి స్కూలు కెళతాడు. అంత ఇంట్లోను నేను, వంట మనిషి మిగిలి ఉంటాము. నాకు మళ్ళీ పుస్తకాలే శరణ్యమయ్యాయి. సాయంత్రం ఇద్దరూ అలిసిపోయి వస్తారు. పేషెంట్ల గురించీ, కేసుల గురించీ చర్చించుకోవటం—ఆ ప్రపంచమే వేరు. రాగానే, "ఎట్లా ఉన్నావ్, మమ్మీ? బుక్స్ చదివేశావా? ఆ. అన్నట్లు రామకృష్ణా మఠంలో ఏవో ఉపన్యాసాలు జరుగుతున్నాయట. వంటామెను తీసుకుని వెళితే వెళ్ళు!" ఇవీ వాడు నాతో పలికే రొటీన్ మాటలు.

అంతే. వాళ్ళిద్దరూ తయారయి సినిమాకో, షికారుకో వెళ్ళేవారు. రోజంతా ఇంట్లో ఉంటే నన్ను కనీసం రమ్మని పిలవనైనా పిలిచే వాళ్ళు కాదు.

మనమడితో కొంతసేపు కబుర్లు చెప్పినా, ఎంత సేపని ఆ ఒంటరితనం భరించను? రామకృష్ణా మఠంలో ఏవో జరుగుతున్నాయని రోజూ అంటూనే ఉంటాడు. ఒక్కనాడైనా నన్ను వెంట పెట్టుకుని తీసుకెళ్ళాడా? ఒంటరిగా వెళ్ళలేక కాదు. వాడట్లా వెళదాం అంటే నా కెంత తృప్తి? వీళ్ళ కోసం నే నెంత కష్టపడ్డాను! వృద్ధిలోకి రావాలని అహోరాత్రులు శ్రమించాను. కేవలం వాళ్ళ కోసమే నా బతుకంతా వెచ్చించాను. వీళ్ళు పెద్దవాళ్ళయిన తరవాత వీళ్ళ ఆశ్రయంలో నిశ్చింతగా గడపాలని అనుకున్నాను. ఇట్లా మా దేశంలోను ప్రతి తల్లీ, తండ్రీ అనుకుంటారు. ఇది ఇక్కడి సంప్రదాయం.




29—6—83

అయితే వాది మానసికమైన అసంతృప్తి. నేను వాళ్ళనుంచి కోరేది కొంచెం ఆదరణ, మాటలు! వాళ్ళ ఇంట్లోని సోఫా, ఫ్రిజ్ లాగా నేనొక అలంకార వస్తువును నేను. ఇంత చిన్న విషయాన్ని నా పిల్లలు ఎందుకని గ్రహించలేదో. గ్రహించినా నిర్లక్ష్యంగా వూరుకున్నారో. ముసలితనం వచ్చినంత మాత్రాన వాళ్ళ కింకే కోరికలు. కాలక్షేపం అవసరం లేదా? విశ్రాంతి తీసుకో! అంటారు తరచుగా. అంతటితో తమ బాధ్యత తీరినట్లు. ఆ 'విశ్రాంతి' అనేది ఎంత ఘోరమైన నరకమో వాళ్ళకు తెలియదు. తెలుసుకోవటానికి ప్రయత్నమూ చెయ్యరు. యువ్వనం అనేది దూకుడుగా పారే ప్రవాహం లాంటిది. ఆ వేగంలో ఏదీ పట్టదేమో! ఎంతకూ ముందుకు పరుగులు పెట్టడమే దాని నైజం కాబోలు!

"నీ బాధ్యతల్ని నువ్వు నిర్వర్తించు. అంతే ఫలితం మాత్రం ఆశించకు!" అన్నది మా కర్మ సిద్ధాంతం. కానీ అది అంత తేలిక కాదు. ఏ విషయాన్నీ మనసుకు పట్టించు కోకుండా, కేవలం నిమిత్త మాత్రంగా ఉంటూ ఫలితాన్ని ఆశించకుండా ఉండటమనేది మనస్సు మీద అధికారం సంపాదించిన స్థిత ప్రజ్ఞులకు తప్ప సామాన్యులకు సాధ్యం కానిది. నేనూ సామాన్యురాలినే. అందుకే భావ సంఘర్షణకు లోనుగాక తప్పలేదు. పెళ్ళిళ్ళు అయ్యేవరకు వాళ్ళు నాతో అంతరంగికంగా సంచరించి, భార్యలొచ్చాక నాకు దూరమై పోవట మనేది సామాన్యమైన విషయంగా కనిపించినా ప్రతితల్లి మనసుకూ అది రంపపుకోతే. అట్లా అని నేను మూర్ఖంగా ఆలోచించటం కానీ, ప్రవర్తించటం కానీ చేయలేదు. నా పిల్లలు భార్యలతో సరదాగా, సుఖంగా ఉంటున్నందుకు నేను ఈర్ష్య పడుతున్నానా? అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

మనకెంతో ఇష్టమైన, ప్రియమైన వ్యక్తులు అంతగానూ మనను ప్రేమిస్తూ, అభిమానిస్తూ హఠాత్తుగా మనపట్ల ఉదాసీనమైఖరిని ప్రదర్శిస్తే ఏమనసు విలవిలలాడదు? దీన్ని ఈర్ష్య అవే అంటే నేను ఈర్ష్య పడుతున్నట్లే లెక్క.

ఒక సాయంత్రం విసుగెత్తిన నేను వంటామెకు అట్లా తిరిగి వస్తానని చెప్పి బైటకొచ్చాను. ఒక థియేటర్‌లో 'మాయాబజార్' సినిమాఆడుతూంటే కాలక్షేపం కోసం వెళ్ళాను. మూడు గంటల వినోదంతో మనసు సేద తీరింది. అక్కడ నుంచి అప్పుడే ఇంటికి వెళ్ళాలనిపించక టాంక్‌బండ్ మీద కొంచెం సేపు కూర్చుని ఇల్లు చేరాను.

నన్ను చూస్తూనే వేణు "వచ్చావా, మమ్మీ! అబ్బ. దిగులుపడి చస్తున్నాను" అన్నాడు.

"దిగులెందుకురా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. నీకు మొదట్నించీ వంటరిగా ఉండటం, తిరగటం అలవాటయినా ఇప్పుడు మీ రోజులు కాదు మమ్మీ! ఎక్కడ, ఎవరు నీ మీద నగల కోసం ఏం అఘాయిత్యం చేశారో అని నాభయం! ఇకనుంచీ మళ్ళీ ట్లా ఒంటరిగా వెళ్ళకు. వంటావిడ్ని తీసుకువెళ్ళు త గా!"

ఈ మాటల్లో ప్రేమ, అభిమానం ఉన్నాయేమో నాకు తెలీదు. ఉన్నాయనుకుని ఆత్మ వంచన చేసుకోలేకపోయాను. మొదట్నించీ ఒంటరిగా తిరిగానుట! ఎవరికోసం? ఆ రోజు మొండిచేసి నేను ధైర్యంగా బైట ప్రపంచంలో కాలు పెట్టకపోయి ఉంటే వీళ్ళు ఏమైపోయి ఉండేవాళ్ళు? సరే . . . ఒంటరిగా వెళ్ళకు. వంటామెను తీసుకువెళ్ళు అన్నాడే గానీ నేను తీసుకువెళతానమ్మా అన్నాడా? ఎందుకని అనలేకపోయాడు? వాడి దృష్టిలో నేను ముసలిదాన్నే గానీ, కన్నతల్లినని అనుకోలేకపోవటం వల్లనా? వీళ్ళు పెద్దవాళ్ళయేదాకా వాళ్ళ బాధ్యతల్ని ఆనందంగా తీసుకున్నాను. అట్లాగే నేను పెద్దదాన్నయినాక నా బాధ్యతని ఆనందంగా ఎందుకని తీసుకోలేక పోయారు వీళ్ళు? ఏమిటీ సృష్టి? ఈ జీవిత గమనం ఎందుకిట్లా జరుగుతూంది? నాలో భయంకరమైన తుఫాను చెలరేగింది. ఇంక అక్కడ అట్లాగే ఉంటే ఈ ఆలోచనలు రాకమానవు. వాడి ప్రవర్తనకు మానసికంగా బాధ తప్పదు. నాకు శాంతి కావాలి. ఎట్లాంటి బలహీనతలకు లోను కాకుండా మనస్సు నిశ్చలంగా ఉండే వాతావరణం కావాలి. ఎక్కడ దొరుకుతుంది మనశ్శాంతి అని ఆలోచించాక ఈ ఆశ్రమాన్ని గురించి అంతకుముందే విని ఉన్నాను కనక ఒక నిశ్చయాని కొచ్చాను.

ఆశ్రమాని కొచ్చేముందు అమ్మాయిని చూసి రావాలనిపించి వెళ్ళాను. అది, దానిభర్త ఇద్దరూ బాంకులో పనిచేస్తున్నారు. ఒక కూతురు. మళ్ళీ గర్భంతో ఉంది. అక్కడా నేను ఒంటరినే. మొదట్నించి పిల్లలతో మసలిన నాకు ఈ అంతులేని వంటరితనం పెద్ద సమస్యగా తయారైంది. నా బాధ గ్రహించినట్లుంది మా అమ్మాయి శారద—నాలుగు రోజులు లీవు పెట్టింది. నా నిర్ణయాన్ని తెలియపరచాను. విని బాధపడింది 'నీకేం తక్కువమ్మా? ఎవరూ లేనట్లు ఆశ్రమంలో ఎందుకు? అన్నదే కాని, 'నా దగ్గర ఉండిపోమ్మా! నన్ను నీ కొడుకుగానే భావించు. నీ కే లోటు రాకుండా చూస్తాను!' అనలేక పోయింది.

'నాకందరూ ఉన్నారు, తల్లీ! కానీ నా మనసులోని శూన్యం మాత్రం పూడటం లేదు. ఏదో ఒక భావాన్ని దానిలో నింపకపోతే నాకు నేను మిగిలేలా లేను. భగవాన్ మహర్షి దగ్గర శాంతి దొరికితే అదే చాలు' అన్నాను నిర్లిప్తంగా. మేం అట్లామాట్లాడుకుంటూ ఉండగానే నా మనవరాలొచ్చి 'మమ్మీ!' అంటూ దూకుడుగా తల్లిమీదపడి మెడను వాటేసుకుంది.

గర్భిణితో ఉన్న దానిపై అట్లా పడడం నాకు కష్టం అన్పించి—దాన్ని ఇవతలకు లాగి కోపంగా ఒక దెబ్బ వేశాను. 'అమ్మ మీద అట్లాపడొచ్చా?' అని గద్దించాను. శారద కూతుర్ని నా చేతుల్లోంచి దగ్గరకు తీసుకుని 'ఎందుకమ్మా దాన్నలా కొట్టావు? నేను కూడా దాన్ని ఇంతమటుకు చిన్న దెబ్బ వెయ్యలేదు. చూడు. ఎంత బిక్కమొహం వేసిందో . . .' నిష్ఠూరంగా అని దాన్ని అనునయించసాగింది. నా మనసు చివుక్కుమన్నది. శారదది మాతృ హృదయం . . .నిజమే! కానీ . . . నాకు నా కూతురు పట్ల అదే భావన ఉంటుందని తెలియదా?

ఇవన్నీ చిన్న చిన్న విషయాలే . . .కానీ లోతుగా పోకుండా ఉండలేకపోవటం నా మానసిక దవుర్బల్యమనుకుంటాను. ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో కూడా మనోనిబ్బరంతో నిలదొక్కుకోగల్గిన నేను ఇంత చిన్న విషయాలకు మనసును పాడు చేసుకోవటం హాస్యాస్పదమే. కాని ఏం చేయాలి నేను? పిల్లలే సర్వస్వమనుకుని బతికినందువల్లనే—ఇప్పు డిట్లా బాధపడుతున్నానేమో! నాకంటూ ఒక జీవితం, లక్ష్యం లేకపోవటంవల్లనే ఈ అశాంతి పాలయ్యానేమో! అందుకే శేష జీవితాన్ని ప్రశాంతంగా, రాగద్వేషాల కతీతంగా గడపాలని నిశ్చయించుకుని ఇక్కడి కొచ్చాను. కానీ చిత్రం ఏమిటంటే నా నిర్ణయం పిల్లల్ని ఏ మాత్రం కదిలించలేకపోవటం! వాళ్ళు బాధపడాలనే ఈ నిర్ణయం తీసుకున్నానా? ఈ మనస్సు ఎన్నో చిత్రాలు చేస్తుంది. ఏమి టీ అనుబంధాలు? అంతా నాటకం కాకపోతే! . . . .

దమయంతి కంఠంలో విరక్తి, దుఃఖం పోటీ పడినాయి.

ఎలిజబెత్ సానుభూతిగా చూసింది దమయంతి వైపు. మా దేశంలోకూడా వృద్ధాప్యం దయనీయంగా గడుస్తుందన్న మాట! సెంటిమెంట్లు, సంప్రదాయాలు మనిషి జీవితానికి నిశ్చింత నివ్వవన్న మాట! ఒ గాడ్!"

దమయంతి కళ్ళు తుడుచుకుంది.

ఎలిజబెత్ మవునంగా ఉండిపోయింది.

అయితే దమయంతి ఆలోచించని, ఎలిజబెత్ ఊహించని మరోకోణం నుంచి చూస్తే—దమయంతి దుఃఖంలో అనౌచిత్యం కనపడుతుంది. ఎలిజబెత్ అభిప్రాయం తప్పని అర్థమవుతుంది. ఇద్దరూ చదువుకున్నవాళ్ళు ప్రపంచజ్ఞానమూ ఉంది. కానీ—ప్రకృతిధర్మాన్నీ మానవ నైజాన్ని అంచనా వేయటంలో ఇద్దరూ పొరబడ్డారు. కాదంటారా? ★